
# కొత్త రిక్షా

– శ్రీధర శ్రీరామకృష్ణ



రిక్షాకు కట్టిన రంగుల రిబ్బన్లు ఎదురుగాలికి విచిత్రంగా నాట్యం చేస్తుంటే, వెనక చక్రాలకు కట్టిన మువ్వలు ఘల్లు ఘల్లుమని చిత్రమైన ధ్వనులు వినిపిస్తుంటే, ముందు చక్రానికి ఆనించి కట్టిన బుడగ 'డుర్' మంటూ మోటారు శబ్దం లాంటిది చేస్తుంటే, ద్విగుణీకృతమైన ఉత్సాహంతో రిక్షా తొక్కుకుపోతున్నాడు అప్పన్న. కొత్త రిక్షా కొనుక్కోగలిగానన్న ఉత్సాహంతో రిక్షాలో కూర్చున్న భారీ శరీరం పెద్ద బరువుగా అనిపించకపోగా, ఓ దూది పింజను రిక్షాలో వేసుకుని తొక్కుతున్న అనుభూతి లాంటిది కలుగుతోందతనికి. ఆరు కిలోమీటర్ల దూరాన్ని అరగంటలో లాగేసి సడెన్ బ్రేకు వేశాడు. రిక్షాలో ఉన్న భారీ శరీరం దిగింది. ఆ భారీ శరీరం అందించిన ఆరు రూపాయలు తీసుకుని చొక్కా జేబులో పెట్టుకుని నుదుట పట్టిన చెమటను తలపాగా చుట్టుకున్న తువ్వాలుతో తుడుచుకున్నాడు. పక్కనే ఉన్న కాకా హోటల్ దగ్గరకొచ్చి రిక్షా ఆపి టీకి ఆర్డరిచ్చాడు. టీ చేతికి వచ్చేలోపు జేబులో డబ్బులు లెక్క పెట్టుకున్నాడు. అరవైకి ఒక్క రూపాయి తక్కువుంది. ప్రొద్దుట్నించి మధ్యాహ్నం ఒంటి గంట దాకా అరవై రూపాయలొచ్చాయంటే గొప్ప మాటే మరి! సాయంత్రానికి ఎంతలేదన్నా ఇంకో నలభై రూపాయలన్నా వస్తాయి. అంటే మొత్తం కల్సి వందన్న మాట! దాంట్లో రిక్షా అద్దె ఇవ్వక్కర్లేదు. ఆ డబ్బుల్తో పిల్లలకి స్వీట్సు పట్టుకెళ్ళవచ్చు. ఆ ఆలోచన రావటంతోటే సెంటర్‌లో స్వీట్‌షాప్‌కెళ్ళి స్వీట్స్ పేక్ చేయించుకుని ఇంట్లోకి కావలసిన సరుకులు, చంటాడికి జ్వరం మందు కొనుక్కుని ఇంటివైపు పోనిచ్చాడు రిక్షాని. వాటిని ఇంట్లో ఇస్తే 'మల్లి' మొహం ఎలా వెలిగిపోతుందో చూడాలని చాలా ఆత్రంగా వుందతనికి. ఇంటిముందు రిక్షా ఆగటంతోటే అంత జ్వరంలోనూ చంటాడు పరుగెత్తుకుంటూ వచ్చి అతని చేతిలోని స్వీట్స్ పాకెట్ అందుకున్నాడు. మల్లి అతని చేతిలోని గుడ్డ సంచీ తీసుకుంది.

ఆమెని చూడగానే అతనికి ముచ్చటేసింది. రోజులా కాకుండా ప్రత్యేకంగా అలంకరించుకుందీ వేళ. నుదుటన గుమ్మడిగింజంత తిలకం బొట్టు దిద్దుకుని. దాని కింద చిన్న చుక్క పెట్టుకుంది. పాపట సింధూరం

అద్దుకుని కళ్ళకు సన్నగా కాటుక పెట్టుకుంది. వదులుగా ముడి వేసుకుని, దాంట్లో ఒక గులాబీ తురుముకుంది. శుభ్రమైన నేతచీర కట్టుకుని, మంచి రవికె తొడుక్కుంది. ఆమె ముందు నడుస్తుంటే, అతను ఆమె వెనకే మహారాజులా నడుస్తున్నాడు.

ఇంతలో...

"ఏయ్ రిక్షా! స్టేట్‌బ్యాంక్‌కి వస్తావా?" ఎవరో అతన్ని కుదుపుతూ లేపేటప్పటికి ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చిపడ్డాడు అప్పన్న.

నీట్‌గా డ్రస్ చేసుకొని తలమీద తెల్ల టోపీ పెట్టుకొని, చేతిలో చిన్న సూట్‌కేసుతో నించుని ఉన్నాడు ఒకాయన ఎదురుగా.

"ఏయ్! స్టేట్ బ్యాంక్‌కి వస్తావా?" అడిగాడాయన మళ్ళీ.

రిక్షాలోంచి గబుక్కున దిగి "ఎక్కండి బాబూ!" అన్నాడు అప్పన్న.

"ఎంతివ్వమంటావ్?"

"పది రూపాయలిప్పించండి బాబూ!"

మారు మాట్లాడకుండా సూట్‌కేసుని రిక్షాలో పెట్టి ఎక్కి కూర్చున్నాడాయన.

అప్పన్నకి కాస్త ఆశ్చర్యమనిపించింది. తను పది రూపాయలడిగితే, అందరిలాగా ఆయన ఏ ఎనిమిది రూపాయలకో బేరమాడతాడనుకున్నాడు. కానీ ఆయన బేరం ఆడకుండానే ఎక్కేశాడు. "ఛ... ఆయనకి పది రూపాయలని చెప్పకుండా ఎనిమిదనే చెప్పుండాల్సిందేమో!" మనసులో కాస్త బాధగా అనిపించిందతనికి.

రోడ్డు కాస్త డౌన్ కావడంతో రిక్షా బాగానే వెళ్తోంది ఎక్కువ కష్టపడక్కరలేకుండానే.

"ఏమయ్యా! రిక్షాలో కూర్చుని ఏవో పగటి కలలు కంటున్నట్టున్నావే" నవ్వుతూ అడిగాడు రిక్షాలో కూర్చున్న ఆసామి.

"ఏం లేదు బాబూ!" సిగ్గుపడుతూ అన్నాడు అప్పన్న.

"ఏమీ లేకపోవడమేమిటోయ్! మూడుసార్లు పిలిచి, కుదిపితేగానీ లేచావుకాదు. పర్వాలేదులే నిజం చెప్పు. మీ ఇంటిదాని గురించేగా ఆ కలలు!"

"కాదు బాబూ!"

"మరి...."

"ఎందుకులే బాబూ అయన్నీ. ఏయో పిచ్చికలలు!"

"పర్వాలేదు చెప్పవోయ్!"

"కొత్త రిచ్చా గురించి తప్ప రిచ్చావోడికి కలలేముంటాయి బాబూ!"

"అంటే ఈ రిక్షా నీది కాదన్నమాట!"

"కాదు బాబూ! అద్దెది..."

"దీనికి అద్దెంతిస్తుంటావ్?"

"కొత్త బండి కదా బాబూ! అందుకే రోజుకి ఇరవై రూపాయలు. అదే ఏ పాతదో అయితే పదో, పన్నెండో వుంటుంది".

రిక్షాలో కూర్చున్న ఆసామి మొహంలో చిరునవ్వు మెరిసి మాయమైంది.

"కొత్త రిక్షా కొనుక్కోవాలంటే ఎంతవుతుంది?"

"బెజవాడలో అయితే నాలుగు వేలు బాబూ! ఇక్కడికి తెచ్చుకునే సరికి కర్చుల్తో కలిసి అయిదు వేలవుద్ది..."

"అవునూ! నువ్వు బేంక్ లోన్ తీసుకుని రిక్షా కొనుక్కోవచ్చుగా!"

"మాలాంటోళ్ళకి అప్పు ఎవరిప్పిత్తారు బాబూ!" ఆయన దిగాల్సిన చోటు రావటంతో రిక్షాకి బ్రేక్ వేస్తూ అన్నాడు అప్పన్న.

"నేనిప్పిస్తానయ్యా! ఈ బ్యాంకు మేనేజర్ నాకు బాగా తెలుసు. ఆయనతో నేను మాట్లాడతాను. నువ్వు సాయంత్రం నాలుగు గంటలకు నీ రేషన్‌కార్డు పట్టుకొని వచ్చి నన్ను కలువు. ఇదిగో ఇక్కడే నించో. నేనొచ్చి నిన్ను లోపలికి తీసుకెళ్తాను రిక్షా దిగుతూ అన్నాడాయన.

అప్పన్న ఆశ్చర్యంగా చూశాడాయనవైపు. ఆ చూపులో మీరు చెప్పింది నిజమా బాబూ అన్న భావం కదలాడింది.

అవునన్నట్టు తలూపుతూ, జేబులోంచి పర్సు తీయబోయాడాయన రిక్షా బాడుగ ఇవ్వటానికి.

"ఉంచండి బాబూ! పర్లేదు" మొహమాట పడుతూ అన్నాడు అప్పన్న.

"సరేనోయ్! సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకి రా! నేను నీకు అప్పిప్పిస్తాను. సరేనా! రేషన్‌కార్డు తెచ్చుకోవడం మాత్రం మర్చిపోకే!" అన్నాడాయన మెట్లెక్కి బ్యాంకు లోపలికి వెళ్తూ.


అప్పన్నకి ఇది కలో నిజమో అర్థం కాలేదు. "ఇంకా ఇలాంటి పుణ్యాత్ములుండబట్టే కలియుగంలో ధర్మమన్నది ఇంకా మిగిలుంది" మనసులో అనుకున్నాడు.

ఈ విషయం మల్లికి చెప్పాలని అతని

## చిగుళ్ళ నుండి రక్తం వస్తుంటే!

ఒక్కోసారి పంటి చిగుళ్ళ నుంచి రక్తం కారుతుంటుంది. ఎప్పుడూ పెద్దగా కనబడదు కానీ ఉదయంపూట పళ్ళు తోముకున్న వెంటనే లేక పళ్ళకు బాగా వత్తిడి తగిలినప్పుడో కొద్దిగా రక్తం కనబడుతూ వుంటుంది. ఈ సమస్య నుంచి బయటపడడానికి చిన్న చిట్కా ఉంది. కప్పు గోరువెచ్చని నీటిలో సగం నిమ్మచెక్క రసం పిండాలి. దానికి చెంచాడు తేనెను కలపాలి. దీన్ని ప్రతిరోజూ ఉదయం త్రాగే నీటిలో ఎక్కువసేపు ఉండేలా మెల్లిగా తాగాలి లేదా చిగుళ్ళను రోజూ కొబ్బరినూనెతో మెల్లిగా మసాజ్ చేసినా ఉపయోగం ఉంటుంది.

**- సంహిత**



మనసు ఆత్రుతపడింది. వెంటనే రిక్షాని ఇంటివైపు పోనిచ్చాడు. ఇంటిముందు రిక్షా ఆపి, లోపలికి నడిచాడు. చంటాడి నుదుటిమీద తడిగుడ్డ కప్పి, ఏడుస్తూ దిగులుగా కూర్చుంది మల్లి.

"అన్నం పెట్టేవే. నీకో మంచి ఇసయం చెప్పాలి!" అన్నాడు అప్పన్న ఉత్సాహంగా.

ఏమిటన్నట్టు చూసిందామె అక్కడ్నుంచి లేచి కంచంలో అన్నం పెట్టి, అందులో పప్పుచారు, ఓ ఊరగాయ ముక్క వేసి చేతికందిస్తూ.

"ఇన్నాళ్ళూ మనం రిచ్చా కొనుక్కోవటం ఎలా అని తల బద్దలు కొట్టుకొంటున్నామా! ఇయ్యాలో బాబు మనకి రిచ్చా కొనుక్కోటానికి డబ్బు అప్పిప్పిస్తానన్నాడే పున్నాత్ముడు" ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడతను అన్నం కలుపుకుని తింటూ.

ఆమె అతనివైపు ఆశ్చర్యంగా చూస్తూ అంది "ఎవరు మావా! మన ముక్కూ మొకం తెలీకండా అంత డబ్బు ఇప్పించేది?"

"ఒకాయన ఉన్నార్లేవే! అది సరేగానీ మన తెల్ల రేసన్‌కార్డు నా రిచ్చాలో సీటు కింద పెట్టు. అన్నట్టు ఆ పల్లన్నీ అయ్యి, ఇంటికి రాటం కొద్దిగా ఆలీసం అవ్వచ్చు. కంగారుపడమాక!" అంటూ చెయ్యి కడుక్కుని, తడిక మీదున్న తువ్వాలుతో చేతులు తుడుచుకుని బయట పడ్డాడు.

ఇంతలో రేషన్‌కార్డు పట్టుకెళ్ళి రిక్షాలో సీటుకింద పెట్టింది మల్లి.

అప్పటికే రెండున్నరైంది.

ఓ రెండు చిన్నచిన్న బేరాలు తగిలితే చూసుకుని, మూడున్నరయ్యేటప్పటికి ఆ బేంక్ దగ్గరికి చేరుకున్నాడు. రిక్షాని నీడలో పెట్టి, తనూ నీడలోనే, ఆయన నుంచోమన్న చోటే నించున్నాడు.

నాలుగయింది. అప్పన్న కళ్ళు ఆత్రంగా ఆ బేంక్ మెట్లవైపే చూస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఆయన రావచ్చు. లేకపోతే మెట్లమీంచే తనని రమ్మనమని సైగ చేయొచ్చని ఎదురు చూస్తున్నాడతను.

నాలుగుంపావయింది.

నాలుగున్నరయింది.

"ఆ పెద్దాళ్ళన్న తర్వాత బోల్డన్ని పనులుంటాయి. అయన్నీ చూసుకుని రావద్దూ ఆయన" అనుకుంటూ ఓపిగ్గా ఎదురు చూస్తున్నాడతను.

ఐదయింది.

బేంకులో పనిచేసేవాళ్ళు ఒక్కొక్కరే మెట్లు దిగి కిందకొచ్చేస్తున్నారు. వాళ్ళతోపాటు ఆయనా కిందికొస్తారేమోనని ఎదురుచూశాడు. చాలామంది వచ్చేశారుగానీ ఆయన జాడ లేదు. నెమ్మదిగా వెళ్ళి కిందకి దిగుతున్నవాళ్ళల్లో ఒకాయన్ని అడిగాడు "బాబుగారూ! తెల్ల టోపీ పెట్టుకున్నాయన లోపలున్నారా?"

"తెల్ల టోపీ పెట్టుకున్నాయనా? ఎవరబ్బా..." అంటూ తల గోక్కొని "ఓహో! వినాయకరావుగారా! ఆయన వచ్చిన అరగంటకే కావాల్సిన డ్రాఫ్ట్ తీసుకుని వెళ్ళిపోయారయ్యా!" అంటూ ముందుకు సాగిపోయాడాయన.

అప్పన్నకి కంట్లో నీళ్ళు నిలిచాయి. ఆయన అప్పు ఇప్పించనందుకు కాదు. తనకు లేనిపోని ఆశలు కల్పించినందుకు.

నిరాశగా వెనుదిరిగి, రిక్షా ఇచ్చేసి ఇంటికి చేరుకున్నాడు. మల్లి అతని కోసం ఎదురుచూస్తోంది.

అతన్ని చూడగానే విషయం అర్థమైందామెకు. ఉత్తి పుణ్యానికి ఎవరో అప్పిప్పిస్తానంటే ఆమెకు నమ్మకం కలగలేదు. కానీ మొగుడ్ని నిరుత్సాహపర్చటం ఎందుకని ఆ విషయం బయల్పరచలేదు.

"మల్లీ! ఆ అయ్య..." అప్రయత్నంగా దుఃఖం ముంచుకు రావడంతో అతని గొంతు బొంగురుపోయింది.

"పోన్లే మావా! మనకి ఈలు దొరికినప్పుడే రిచ్చా కొనుక్కుందాంగానీ దాని గురించి ఇదవమాక" అతని చేతుల్ని తన చేతిలోకి తీసుకుని ప్రేమగా స్పృశిస్తూ అనునయంగా అందామె.

దుఃఖంతో అతని గొంతు తడారిపోయింది. మంచినీళ్ళు కావాలన్నట్టు సైగచేశాడు.

ఆమె అతని చేతికి చెంబుతో మంచినీళ్ళందించింది.

మంచినీళ్ళు కొద్దిగ్గా తాగి, బీడీ వెలిగించి, మంచంమీద నడుం వాల్చి గుప్పుమని పొగ వదుల్తూ ఏదో ఆలోచిస్తున్నాడు అప్పన్న.

చంటాడిని కాళ్ళమీద పడుకోబెట్టుకొని, గవర్నమెంటాసుపత్రి నుంచి తెచ్చిన రంగునీళ్ళు చెమ్చాతో పోస్తూ అతన్నే చూస్తోంది మల్లి.

ఇంతలో ఉన్నట్టుండి అన్నాడు అప్పన్న "మల్లీ! మనం తప్పకుండా రిచ్చా కొనుక్కుంటావే!"

ఎలా అన్నట్టు చూసిందామె.

"రేపట్నుంచి నేనో గంటసేపు ఎక్కువ రిచ్చా తొక్కుతానే. ఆ గంటలో వచ్చిన డబ్బులన్నీ, మనకెన్ని రోగాలొచ్చినా, రొట్టులొచ్చినా, కట్టాలొచ్చినా, నట్టాలొచ్చినా, పత్తులున్నా, పరవాన్నం తిన్నా అట్టానే దాచుకుందాంలే! ఇయ్యాల కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి, ఎల్లుండి కాకపోతే ఆవలెల్లుండి... ఓ ఏడాదిలోపు రిచ్చా కొనుక్కునే తీరతాం!" దృఢనిశ్చయంతో అన్నాడు అప్పన్న.

అతని గొంతులో వినిపించిన ఆశాభావానికి, కృతనిశ్చయానికి మల్లి నిజంగా విస్తుపోయింది. మెచ్చుకోలుగా చూసిందతన్ని.

ఆ రోజు రాత్రి వాళ్ళిద్దరి కలల్లోనూ కనిపించింది ఒక్కటే "కొత్త రిక్షా".

